సాక్షి తిరుపతి

శనివారం। 6। జనవరి। 2024



విషప్రచారమెందుకు సుధీరా?

టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ అధికార పార్టీపై విషం కక్కుతుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. - 8లో



లారీని ఢీకొన్న బస్సు

నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి కొత్తూరు వద్ద లారీని ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. - 8లో



తిరుపతి..పెరిగిన పరపతి

తిరుపతి మరో సారి తన పరపతి చాటింది. స్వచ్ఛ సర్వేక్షణ్ పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికైంది. - 8లో

న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



లోకనాథం

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారిగా ఆర్.లోకనాథం శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈయన ప్రకాశం జిల్లా నుంచి తిరుపతికి బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న శ్యామ్‌మోహన్‌ను కడప జోన్-4 ఆర్‌ఎస్‌డీ (రీజినల్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్)గా పదోన్నతి పొందారు. ఈయన తిరుపతి కలెక్టరేట్ నుంచే నాలుగు జిల్లాల పర్యావేక్షణ చేయనున్నారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ అభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు.

వలంటీర్ ఖాళీలు భర్తీ చేయండి

తిరుపతి అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న వలంటీర్ స్థానాలను భర్తీ చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఈనెల 7 నుంచి 16వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించాలని, 17న దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. 18వ తేదీ సెలెక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూలు ఉంటాయని, 19వ తేదీన పోస్టింగ్ ఇస్తారని వివరించారు. ఆ మేరకు సిబ్బంది చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పద్మావతి కార్డియాక్ ఆస్పత్రికి సూపర్ స్పెషాలిటీ హోదా



డాక్టర్ శ్రీనాథరెడ్డి

తిరుపతి తుడా: టీటీడీ పద్మావతి చిల్డ్రన్స్ కార్డియాక్ సెంటర్‌కు సూపర్ స్పెషాలిటీ హోదా, అక్రిడిటేషన్ గుర్తింపునిస్తూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. చిన్నపిల్లల కార్డియాలజీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా, రాష్ట్రంలో అక్రిడిటేషన్ గుర్తింపు పొందిన తొలి చిన్నపిల్లల ఆస్పత్రిగా తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల కార్డియాక్ సెంటర్‌గా నిలిచింది. ఈ గుర్తింపుతో కార్డియాలజీ ఆస్పత్రికి రెండు సూపర్ స్పెషాలిటీ వైద్యుల పోస్టులకు అనుమతి లభించింది. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్ రెడ్డి మాట్లాడుతూ ఈ గుర్తింపుతో ఆస్పత్రి ప్రతిష్ట పెరగడంతోపాటు ఇద్దరు వైద్యనిపుణులు అదనంగా రానున్నారన్నారు.

ఎస్వీయూలో ఆన్‌లైన్‌లోనే ఫీజుల చెల్లింపు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఈ నెల 8వ తేదీ నుంచి ఫీజుల చెల్లింపు ప్రక్రియ ఆన్‌లైన్ క్యూఆర్ కోడ్ ద్వారానే నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ మహ్మద్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల పరీక్షల ఫీజులు, వర్సిటీ పరిధిలోని కళాశాలలు చెల్లించే ప్రతి నగదు వ్యవహారాలు ఇక నుంచి వర్సిటీ వెబ్‌సైట్‌లో తెలిపిన క్యూఆర్ కోడ్‌తోనే చెల్లింపులు జరగాలని తెలిపారు. ఇక నుంచి బ్యాంకుల నుంచి చెల్లించే ఈ చలానాలకు స్వస్తి పలకనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వర్సిటీ https:// svuexams. edu. in/ studentportal అనే వెబ్‌సైట్‌లో పేర్కొన్న క్యూఆర్ కోడ్ ద్వారానే అన్ని నగదు చెల్లింపులు చేయాలని ఆయన ఆ ప్రకటనలో సూచించారు.

వ్యవసాయానికి పగటి పూటే 9 గంటల విద్యుత్



చిన్నగొట్టిగల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న టెక్నికల్ డైరెక్టర్

భాకరాపేట : వ్యవసాయానికి పగటి పూటే 9 గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం చిన్నగొట్టిగల్లు సబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంలో విద్యుత్ సంస్థలు ముందున్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య కారణంగా పంటలు దెబ్బతిన్న దాఖలాలు లేవన్నారు. రైతుకు సంబంధించి ఎలాంటి సమస్యలున్నా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు తెలియజేయవచ్చని తెలిపారు. వినియోగదారులు సమస్యలు పరిష్కరించడంలో సంస్థ ఎలాంటి ఆలస్యం చేయదని చెప్పారు. అనంతరం సబ్ స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఈ మునిచంద్ర, డిప్యూటీ ఈఈ శివయ్య, ఏఈ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



రాపూరులో జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనం

వెంకటగిరి కోటలో జైత్రయాత్ర

ఒకపక్క కుట్రపూరిత రాజకీయాలు.. మరో పక్క పచ్చ పత్రికల విషపు రాతలు.. ఇంకో వైపు కొన్ని ఏడుపుగొట్టు టీవీ చానళ్ల కక్ష సాధింపులు.. ఇవేవీ సీఎం జగన్‌పై ప్రజలకున్న అభిమానాన్ని ఇసుమంతైనా తగ్గించలేకపోయాయి. గుండెల నిండా సమరోత్సాహాన్ని నింపుకొని, కంఠాలను జైగంటలుగా మోగిస్తూ, వెంకటగిరి పురవీధుల్లో కవాతు చేస్తూ ముందుకు కదిలింది జగన్ సైన్యం. సంక్షేమ సారథి సీఎం జగనన్నకు సెల్యూట్ చేస్తూ.. జైజగన్ జైజై జగన్ నినాదాలు హోరెత్తించింది. వెంకటగిరి పట్టణంతో పాటు, దక్కిలి, రాపూరు జనసంద్రమైంది. సాధికార బస్సు యాత్రకు నీరాజనాలు పట్టింది.

- సాధికార బస్సు యాత్రకు నీరాజనం
- జన సంద్రమైన వెంకటగిరి
- రాపూరు సభలో ఇసుకేస్తే రాలనంత జనం
- డక్కిలి బస్టాండ్‌లో నేతల ప్రసంగం
- మళ్లీ జగనే సీఎం కావాలంటూ హోరెత్తిన నినాదాలు

సైదాపురం/రాపూరు: వెంకటగిరిలో వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర దిగ్విజయమైంది. వెంకటగిరి పట్టణానికి తండోపతండాలుగా జనం తరలిరావడంతో మరో జాతరను గుర్తుచేసింది. ముందుగా వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో బంగ్లా వద్ద చేనేత సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. పలు తీర్మానాలను కూడా ఆమోదించారు. బంగ్లా వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అంబేడ్కర్, పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి పోలేరమ్మ ఆలయం మీదుగా ర్యాలీ సాగింది. బాణసంచా పేలుళ్లతో వెంకటగిరి పట్టణం దద్దరిల్లింది. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రాల స్వారీ ర్యాలీ ఆకట్టుకుంది. పట్టణంలోని పోలేరమ్మ ఆలయం వద్ద పూజలు నిర్వహించి కాంపాళెం మీదుగా డక్కిలి, రాపూరుకు బస్సు యాత్ర చేరుకుంది. తిరుపతి ఎంపీ గురుమూర్తి, కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, నటుడు, వైఎస్సార్‌సీపీ ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, ఎమ్మెల్సీలు మేరిగ మురళీధర్, సిపాయి సుబ్రమణ్యం, పోతుల సునీత, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ నాగార్జునయాదవ్, దేవాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సురేంద్ర, నెల్లూరు మేయర్ స్రవంతి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారికి డక్కిలి, రాపూరులో క్రేన్ల సహాయంతో గజమాలలు వేసి ఆత్మీయంగా సాగతం పలికారు. 20 కిలోమీటర్ల వరకు సాగిన బస్సు యాత్రకు పూల వర్షం కురిపించారు.





సమరయోధుల చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న రామ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ గురుమూర్తి

కదిలొచ్చిన మహిళా లోకం

బస్సు యాత్రకు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ జెండాలు చేతబట్టుకుని ఉత్సాహంగా తరలివచ్చారు. వెంకటగిరి నుంచి రాపూరు వరకు రహదారుల్లో ఇసుక వేస్తే రాలనంతగా జనం నిండిపోయారు.

ఆలోచింపజేసిన ప్రసంగాలు

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల అభ్యున్నతి కోసం నాలుగున్నరేళ్లగా అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నేతలు పూసగుచ్చినట్టు వివరించారు. చంద్రబాబు, వైఎస్ జగన్ పాలన మధ్య ఉన్న వ్యత్యాసాన్ని విశదీకరించగా.. జనం చప్పట్లు కొడుతూ జగన్‌కు జేజేలు పలికారు. రోషాల గడ్డ రాపూరు అనగానే చప్పట్లు మార్మోగాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

పార్టీ సాంస్కృతిక విభాగం అధ్యక్షులు వంగపండు ఉషా బృందం సంక్షేమం, అభివృద్ధిపై పాటలు పాడి జనాన్ని మెప్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దొంతు శారద, పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాడా జానకిరామయ్య, నేతలు పాపకన్ను మధుసూదన్ రెడ్డి, దయాకర్‌రెడ్డి, నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, బాలయ్య, బత్తిన పట్టాభిరామిరెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్ రెడ్డి, వైస్సార్సీపీ నేత పాపకన్ను మధుసూదన్ రెడ్డి, సైదాపురం మండల కన్వీనర్ రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరాజు, ప్రసాద్ రెడ్డి, నారాయణరెడ్డి, రాపూరు మండల కన్వీనర్ దయాకర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రవీంద్ర రెడ్డి, తోట గణేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్తీక్ రెడ్డి అన్ని మండలాల కన్వీనర్లు, జేసీఎస్‌లు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

మనసున్నమారాజు సీఎం జగన్

దక్కిలి: మనసున్న మహరాజు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సామాజిక సాధికారక బస్సుయాత్రలో భాగంగా ఆయన డక్కిలిలో మాట్లాడుతూ అన్ని వర్గాలకు అండగా ఉండే నాయకుడు సీఎం జగన్ అన్నారు. ఆయనను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు.

ఆశీర్వదించండి.. రికార్డు సృష్టించండి

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించి 175కు 175 స్థానాలు వచ్చేలా ప్రజలు ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, సినీ నటుడు ఆలీ సూచించారు. సాధికార బస్సు యాత్రలో భాగంగా ఆయన డక్కిలిలోని దేవునివెల్లంపల్లి రోడ్డు సెంటర్, కమ్మపల్లి రోడ్డు సెంటర్‌లో మాట్లాడారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురమల్లి జనార్దన్‌రెడ్డి సినీ ఇండస్ట్రీకి ఎంతో మేలు చేశారని కొనియాడారు. తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు హయాంలో ఏ రోజైనా సకాలంలో వర్షాలు కురిశాయా అని ప్రశ్నించారు. నెల్లూరు మేయర్ స్రవంతి మట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో సీఎం జగనన్న రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు.



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి



సాంస్కృతిక నీరాజనం



ఎత్తర జెండా..ఇదే మన ఎజెండా! డక్కిలి కూడలిలో సాధికార బస్సు యాత్రలో పూల వర్షం కురిపిస్తున్న అభిమానులు



పోలేరమ్మ ఆశీస్సులు అందుకుని ర్యాలీగా బయలుదేరిన నేతలు



మళ్లీ రావాలి జగన్

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- జిల్లాలో 3,009 మందికి రూ.4.38 కోట్ల లబ్ధి

తిరుపతి అర్బన్: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ తెలిపారు. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా లబ్ధిపొందని వారు రాష్ట్ర వ్యాప్తంగా 68,990 మందికి రూ.97.76 కోట్లను శుక్రవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేశారు. అదే సమయంలో కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమానికి డీఆర్వోతోపాటు డీఆర్డీఏ పీడీ జ్యోతి, మెప్మా పీడీ రాధమ్మ సంబంధిత అధికారులు, లబ్ధిదారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలో వివిధ పథకాల ద్వారా 3,009 మందికి రూ.4.38 కోట్లు మంజూరైందని చెప్పారు. ఈ మేరకు మెగా చెక్కును అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 2023-24 రెండో విడతను సంక్షేమ క్యాలెండర్ మేరకు ఇస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి సంవత్సరం ఆరు మాసాల్లో అర్హత కలిగిన లబ్ధిదారులకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలనే స్థిర సంకల్పంతో ఆగస్టు 2023 నుంచి డిసెంబర్ 2023 వరకు అర్హులై ఉండి పొరపాటున ఏ కారణం చేతనైనా లబ్ధి పొందని వారికి మరో అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు. ఇంకా అర్హులు ఎవరైనా ఉంటే నెలలోపు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవసరమైతే వలంటీర్ సేవలు వాడుకోవచ్చునని, లేదా 1902కి కాల్ చేస్తే వారు తగు సూచనలు ఇస్తారని వివరించారు.



సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు

మళ్లీ జగనన్నే సీఎం కావాలి



మాది కొరమేనుగుంట. నా భర్త చనిపోయారు. నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో నాకు వితంతు పింఛన్ వచ్చేది కాదు. ఇప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో వితంతు పెన్షన్ వస్తోంది. అమ్మఒడి నాలుగు సార్లు లబ్ధి చేకూరింది. నా కుటుంబానికి ఆర్థిక చేయూతనందించిన జగనన్న మళ్లీ సీఎం కావాలి. -ఉమ

ఆటోదారులకు అండ



నేను 20 ఏళ్లుగా ఆటో నడుపుతున్నాను. జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ప్రతి ఏటా రూ.10 వేలు నా అకౌంట్‌లో పడుతోంది. ఈ ఏడది నా ఆధార్ కార్డులో పొరబాట్లు ఉండడంతో నాకు డబ్బు పడలేదు. పొరబాట్లను సరిదిద్దుకోవడంతో మళ్లీ లిస్టులో నా పేరు చేర్చారు. ఇప్పుడు రెండో విడతలో నాకు రావలసిన మొత్తం నగదు వచ్చింది. నాలాంటి వారికి ఎంతో మందికి లబ్ధి చేకూరింది. -గోపీప్రతాప్‌రెడ్డి

చరిత్రలో నిలిచేలా పింఛన్ల పండుగ

- సీఎం జగనన్న ఇచ్చిన మాట ప్రకారం రూ.3 వేల పింఛన్
- పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన వెల్లడి

తిరుపతి మంగళం: దేశ రాజకీయ చరిత్రలో ఎవ్వరికీ సాధ్యంకాని విధంగా చరిత్రలో నిలిచిపోయేలా సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ల పెంపును రూ.3వేలకు పెంచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తిరుపతి ఎమ్మార్‌పల్లె సర్కిల్‌లో శుక్రవారం పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. అర్హత కలిగిన పెన్షన్‌దారులకు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ రూ.3వేల చొప్పున అందించారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మాట్లాడుతూ మాట తప్పని మడం తిప్పని నాయకుడుగా జగనన్న చరిత్రలో నిలిచిపోయారన్నారు. దశల వారీగా రూ.2వేల నుంచి రూ.3 వేలకు పింఛన్లు పెంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల ద్వారా రూ.3.35 లక్షల కోట్లను ప్రజలకు అందించారన్నారు. అదే చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో కేవలం రూ.1,700 కోట్లు కూడా అందించలేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలన్న దురాలోచనతో మళ్లీ హామీలు గుప్పిస్తున్నాడని, ప్రజలు చంద్రబాబు మాటలను నమ్మి ఓటు వేస్తే ఓడిపోయేది జగనన్న కాదని, మీరేనని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జగనన్న లాంటి నాయకుడు అధికారంలో ఉంటే మరిన్ని సంక్షేమ పథకాలు పొందుతారన్నారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించాలన్నారు.



లబ్ధిదారులతో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డెప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ



శరణమయ్యప్పా!

రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి శుక్రవారం శబరికి వెళ్లారు. అక్కడ అయ్యప్పస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

– తిరుపతి మంగళం

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి అతని నుంచి మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన శ్రీకాళహస్తి మండలం, వాంపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రూరల్ సీఐ అజయ్‌కుమార్ కథనం.. వాంపల్లి గ్రామానికి చెందిన నరసింహులు(55) స్థానిక చెక్‌పోస్టుకు సమీపంలో మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు నిర్వహించారు. 19 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకుని నరసింహులును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి అతనికి రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

మరో వ్యక్తి అరెస్టు

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన తొట్టంబేడు మండలం, చోడవరంలో చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం.. చోడవరం ఎస్టీకాలనీకి చెందిన శ్రీరాములయ్య కాలనీ సమీపంలో మద్యం బాటిళ్లను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అతని వద్ద 12 మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి అతనికి రిమాండు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

విషప్రచారమెందుకు సుధీరా?

- చెంచులక్ష్మి కాలనీలో కాలేజీ స్థలం ఆక్రమిస్తున్నారంటూ రాద్ధాంతం
- అక్రమార్కులను వెనకేసుకుని హైడ్రామా
- గిరిజనులు ఇళ్లు నిర్మించుకుంటే గిట్టని వైనం
- అడ్డుకున్న స్థానికులు


చెంచులక్ష్మి కాలనీలో తమ గోడు వెళ్లబోసుకుంటున్న మహిళలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రభుత్వంపైన, స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపైన నిందలేయడం, నోటికొచ్చినట్టు తిట్టడం అలవాటు చేసుకున్నారు. ఆయన తీరుతో జనం విసిగివేసారిపోతున్నారు. గోరంతది కొండంతలు చేసి వివాదాలు సృష్టించి చివరకు అభాసుపాలవుతున్నారు. ఇలాంటిదే శుక్రవారం పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న గిరిజనులు 12 ఏళ్లగా తొట్టంబేడు బాలికల కళాశాల పక్కన ఉన్న అక్రమిత బాడుగ ఇళ్లల్లో నివాసముంటున్నారు. చాలీచాలని బతుకులకుతోడు బాడుగలు చెల్లించలేక సతమతమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే తక్షణం వారికి స్థలాలు చూపాలని స్థానిక పార్టీ ఇన్‌చార్జ్ ఘోరాను ఆదేశించారు. ఆయన చెంచులక్ష్మి కాలనీలోని తొట్టంబేడుకు చెందిన బాలికల కళాశాల పక్కన ఉన్న కొంత ఖాళీ స్థలాన్ని చూపారు. ఆపై తన సొంత ఖర్చులతో చదును చేసి గిరిజనులకు అప్పగించారు. అంతరం గిరిజనులు గుడిసెలు వేసుకునేందుకు యత్నించారు. తాను అక్రమించి అమ్ముకునేందుకు కాపు కాసిన స్థలం గిరిజనులు సొంతం చేసుకుంటున్నారన్న అక్కసుతో టీడీపీ మద్దతుదారు కూలి రవి విషయాన్ని బొజ్జల సుధీర్‌దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రెచ్చిపోయిన సుధీర్ శుక్రవారం చెంచులక్ష్మికాలనీకి చేరుకుని నానాయాగీ చేశారు. ఎమ్మెల్యే ఆక్రమించుకున్నాడంటూ అక్రమార్కుడిని వెంటేసుకుని హైడ్రామాకు దిగారు. ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేయాలని కళాశాల ప్రిన్సిపల్‌పై ఒత్తిడి తెచ్చారు. ఆపై స్థానిక మహిళలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయగా.. స్థానికులు తిరగబడడంతో కిమ్మనకుండా వెనుదిరిగారు.

నాపై కేసు వేశారు



2018లో ఆరు ఎకరాల విస్తీర్ణంలోని కళాశాల చుట్టూ గోడ నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. నాడు ప్రహరీ గోడ నిర్మించకుండా కొందరు అడ్డుకున్నారు. తర్వాత నాపై కేసు నమోదు చేశారు. మా విద్యార్థులు రోడ్డెక్కడంతో వెనక్కుతగ్గారు. అప్పటి నుంచి కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించలేదు. ఇప్పుడు రూ.49 లక్షలతో నాడు–నేడు ద్వారా కళాశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. – సుధాకర్, ప్రిన్సిపల్, తొట్టంబేడు మహిళా కళాశాల

అడుక్కునేవాడి దగ్గరే దోచుకున్నారు



వికలాంగుడినైన నేను 12 ఏళ్ల క్రితం గుడూరు నుంచి నలుగురు పిల్లలతో శ్రీకాళహస్తికి వచ్చా. భిక్షాటన చేసుకుంటున్నా. చెంచులక్ష్మి కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉండేవాడిని. 2018లో కూలి రవి అనే వ్యక్తి వద్ద కూడబెట్టుకున్న రూ.50వేలతో ఇంటి స్థలం కొనుగోలు చేశా. ఆపై అతను తిరగబడ్డాడు. ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకో అంటూ ఇబ్బందులు పెట్టాడు. ఇప్పుడు కళాశాల మైదానంలో ఉన్న షెడ్డులో ఉంటూ భిక్షాటన చేసుకుని నలుగురు పిల్లలను సాక్కుంటున్నా. ఎమ్మెల్యేకు విషయం తెలిసి నాకు ఇంటి స్థలం కేటాయించారు. కూలి రవి నాపై దాడి చేసే అవకాశం ఉంది. – మునీశ్వర్

లారీని ఢీకొన్న ట్రావెల్స్ బస్సు


లారీని ఢీకున్న ట్రావెల్ బస్సు


క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ దినేష్‌ప్రతాప్‌సింగ్ మృతదేహం

- ఇద్దరు డ్రైవర్ల మృతి
- మరో నలుగురికి గాయాలు


గాయపడిన వారిని 108 వాహనంలో వైద్యశాలకు తరలిస్తున్న సిబ్బంది

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి కొత్తూరు గ్రామం వద్ద శుక్రవారం లారీని ట్రావెల్ బస్సు ఢీకొన్న ఘటనలో బస్సు డ్రైవర్ దినేష్ ప్రతాప్‌సింగ్(48) అక్కడికక్కడే మృతి చెందగా, లారీ డ్రైవర్ ఇలగవన్(42) చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ సమాచారం మేరకు.. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం, జగదల్‌పూర్ నుంచి తిరుపతికి ప్రయాణికులతో వెళుతున్న గుప్త ట్రావెల్ బస్సు మార్గ మధ్యలో కొత్తూరు గ్రామం వద్ద వేలూరు నుంచి కంకరలోడ్డుతో నెల్లూరుకు వెళుతున్న లారీని ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలో బస్సు డ్రైవర్ దినేష్ ప్రతాప్‌సింగ్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. లారీ డ్రైవర్ ఇలగవన్‌కు కుడి కాలు విరిగిపోయింది. స్థానికులు 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో దినేష్‌ప్రతాప్‌సింగ్ మృతి చెందాడు. బస్సులో ప్రయాణిస్తున్న ఏడుగురిలో నలుగురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను నాయుడుపేటకు తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

దర్యాప్తు ముమ్మరం


బాలిక సోని కుమారి(ఫైల్)

చంద్రగిరి: బాలిక అదృశ్యం అయిన ఘటనపై చంద్రగిరి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మండల పరిధిలోని ఎం.కొంగరవారిపల్లి జగనన్న కాలనీలో ఝార్ఖండ్‌కు చెందిన రాజేష్‌నాయక్ తన కుటుంబంతో కలిసి సిమెంటు రాయి బట్టీలో పనిచేస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి తన ఆరేళ్ల కుమార్తె సోనికుమారి కనిపించకుండా పోయింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి 20 బృందాలతో దర్యాప్తు చేస్తున్నారు. బాలిక ఆచూకీ తెలిసిన వారు చంద్రగిరి పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

కాలువ దాటుతూ..


మృతి చెందిన నాగయ్య

చిల్లకూరు: తీర ప్రాంతంలోని వేళ్లపాళెం సమీపంలో సాన కాలువ దాటుతూ శుక్రవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల వివరాలు.. మండలంలోని తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన నాగయ్య(65) చీపుర కట్టలను విక్రయించేందుకు కోటకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లే క్రమంలో వేళ్లపాళెం వద్ద బస్సు దిగి అడ్డంగా తూర్పుకనుపూరు చేరేందుకు సాన కాలువ దాటే ప్రయత్నం చేశాడు. ఈ క్రమంలో అతను సాన కాలువలో నీరు ఎక్కువగా ఉండడంతో కూరుకు పోయాడు. అటుగా వెళ్లే వారు నాగయ్య మృతదేహాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం ఇచ్చారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదు.

తిరుపతి.. పెరిగిన పరపతి

- స్వచ్ఛతలో మరోసారి సత్తా
- జాతీయ ర్యాంక్‌కు ఎంపిక
- కమిషనర్ హరిత

తిరుపతి తుడా: స్వచ్ఛ సర్వేక్షన్ పోటీల్లో ఆధ్యాత్మిక తిరుపతి నగరం మరోసారి సత్తా చూపి తన పరపతిని చాటింది. ఇప్పటికే ఏడుసార్లు టాప్–10 లోపు జాతీయ ర్యాంకులు సాధించిన తిరుపతి నగరం తన సత్తా చాటుతూ వస్తోంది. ఈ క్రమంలో స్వచ్ఛ సర్వేక్షన్ 2023 సంవత్సరానికి గాను మరోసారి జాతీయ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది. ఢిల్లీ వేదికగా ఈ నెల 11వ తేదీన స్వచ్ఛభారత్ మిషన్ ఆధ్వర్యంలో జాతీయ, జోనల్, రాష్ట్ర ర్యాంక్‌లను ఆయా నగరాలకు అందించనున్నారు. ఈ మేరకు జాతీయ ర్యాంక్‌కు తిరుపతి నగరం ఎంపికైనట్టు స్వచ్ఛభారత్ మిషన్ సంయుక్త కార్యదర్శి రూపా మిశ్ర ఈ మేరకు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు సమాచారం అందజేశారు. జాతీయ అవార్డును అందుకునేందుకు 10వ తేదీకల్లా ఢిల్లీకి చేరుకోవాలని అందులో పేర్కొన్నారు.

స్వచ్ఛతను కొనసాగిస్తున్నాం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి నగర ప్రతిష్టను దృష్టిలో ఉంచుకుని క్లీన్ తిరుపతి కోసం నిరంతరం పనిచేస్తున్నాం. 920 కార్మికులతో నిత్యం మెరుగైన పారిశుద్ధ్యం అమలు చేస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరణ మొదలు తరలింపు, సెగ్రిగేషన్, రీసైక్లింగ్, రీ యూజ్‌ను వందశాతం పక్కాగా అమలు చేస్తున్నాం. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, స్వచ్ఛ భారత్ మిషన్ నిబంధనలకు అనుగుణంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పనిచేస్తోంది. చెత్త నిర్వహణ కోసం భారీ వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. ఈ క్రమంలోనే తిరుపతి నగరం జాతీయ ర్యాంక్‌ను వరుసగా సాధిస్తూ వస్తోంది. ఈ సారికూడా జాతీయ ర్యాంక్ రావడం సంతోషంగా ఉంది. ప్రజల సహకారంతో తిరుపతిని మరింత ముందుకు తీసుకెళతాం. అవార్డులు, రివార్డుల వెనుక కార్మికుల కష్టం ఎనలేనిది. వారి సేవలను నగర ప్రజలు గుర్తించి సహకరించాలి. – డి. హరిత, కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

బాధితులకు భరోసా కల్పించాలి

- గతేడాదితో పోలిస్తే 23 శాతం తగ్గిన నేరాలు
- సార్వత్రిక ఎన్నికలకు సిబ్బంది సన్నద్ధం కావాలి
- చంద్రగిరి పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి

చంద్రగిరి: ఆపదలో ఉన్నవారు, సహాయం కోరేవారు మాత్రమే పోలీసు స్టేషన్‌కు వస్తారని, వారికి భరోసా కల్పించాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంటుందని తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన వార్షిక తనిఖీల్లో భాగంగా చంద్రగిరి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సుమారు రెండు గంటల పాటు జనరల్ డైరీ, కేసు డైరీ, కోర్టు క్యాలెండర్ తదితర రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులు, సైబర్, మహిళా నేరాలను దర్యాప్తు సకాలంలో పూర్తి చేసి, బాధితులకు న్యాయం చేయాలన్నారు. చంద్రగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో జాతీయ రహదారులు ఉన్నందున నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ముఖ్యంగా రంగంపేట–భాకరాపేట ఘాట్ రోడ్డులో ప్రమాదకరమైన మలుపులు, క్రాసింగ్‌లను గుర్తించి, సూచిక బోర్డులు, వార్నింగ్ సిగ్నల్ వ్యవస్థ, స్టాపర్లు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. అలాగే గాదంకి టోల్ ప్లాజా, రంగంపేట చెక్ పోస్ట్ వద్ద ఆకస్మికంగా వాహనాల తనిఖీలను నిర్వహించి, ఎర్ర చందనం, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిబ్బంది సన్నద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి డీఎస్పీ, యశ్వంత్, సీఐలు రాజశేఖర్, చంద్రశేఖర్ పిళ్లై, ఎస్ఐలు హిమబిందు, రవీంద్ర నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.